

ఇటుక దందా..

ఉమ్మడి గండేడ్ మండల పరిధిలో ఇటుక బట్టీల దందా ఇష్టానుసారంగా సాగుతోంది.

వివరాలు 8లో ▸



వైభవంగా తిరుచ్చి సేవ

మన్యంకొండలో శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ ఘనంగా నిర్వహించారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.2/19.3

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ వేడిమి.. ఉదయం, రాత్రి వేళల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోస్గి పర్యటన రద్దు

కోస్గి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోస్గి పర్యటన రెండోసారి రద్దయ్యింది. ఈ నెల 5న మొదటిసారి ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు చేయగా అనివార్య కారణాలతో కార్యక్రమం రద్దు అయ్యింది. తాజాగా ఆదివారం కోస్గి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అభివృద్ధి పనులకు శిలాఫలకాలు వేసి, ఎల్ఎస్ గార్డెన్స్‌లో మహిళా సంఘాల స్టాళ్ల పరిశీలన, చెక్కుల పంపిణీతోపాటు భారీ బహిరంగ సభ, అధికారిక కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం, సభకు పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేశారు. అయితే ఇప్పుడు కూడా చివరి నిమిషంలో పర్యటన రద్దు అయినట్లు అధికారులు తెలిపారు. తదుపరి పర్యటనకు సంబంధించి సీఎంఓ కార్యాలయం నుంచి పర్యటన షెడ్యూల్ రాగానే వివరాలు వెల్లడిస్తామని వారు పేర్కొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి




నారాయణపేట రూరల్: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతీ పోలీసు కంకణబద్ధులు కావాలని నూతన డీఎస్పీ ఎన్.లింగయ్య అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన శనివారం మహబూబ్‌నగర్‌లోని జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందించారు. అనంతరం ఆయన జిల్లాకు చేరుకోగా సీఐలు, పీఎస్‌ల ఎస్‌హెచ్ఓలు స్వాగతం పలికారు. వారితో ఆయన మాట్లాడుతూ.. అందరికి అందుబాటులో ఉండి సబ్ డివిజన్ పరిధిలోని పీఎస్‌లలో క్రైమ్ రేట్ తగ్గించేందుకు కృషి చేద్దామని, శాంతి భద్రతల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండకుండా ప్రజలు, ఇతర శాల అధికారుల సహకారంతో ముందుకు పోవాలన్నారు. దొంగతనాలు, ఆన్‌లైన్ మోసాలను అరికట్టడానికి, మహిళల రక్షణకు పనిచేద్దామని, చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా బీజేపీ రాష్ట్ర నాయకులు రతంగపాండురెడ్డి, రఘువీర్‌యాదవ్, పీ.శ్రీనివాసులు, రఘువీర్ యాదవ్, రఘురామయ్యగౌడ్, లక్ష్మి కలిసి శాలువాతో సన్మానించారు.

అలసందలు క్వింటా రూ.7,636

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం అలసందలు క్వింటా గరిష్టం, కనిష్టంగా రూ.7,636 ధర పలికింది. అలాగే, వేరుశనగ గరిష్టం రూ.6,874, కనిష్టం రూ.4,549, ఎర్ర కందులు గరిష్టం రూ.10,389, కనిష్టం రూ.10,060, తెల్ల కందులు గరిష్టం రూ.10,888, కనిష్టంగా రూ. 10,289 ధరలు పలికాయి.

ప్రగతి పరుగులు..

ఎన్నో ఏళ్ల రైతుల కల నెరవేరుస్తూ నారాయణపేట – కొడంగల్ లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టుకు అనుమతులు.. మెడికల్.. పాలిటెక్నిక్ అగ్రికల్చర్.. డిగ్రీ కళాశాలలు మంజూరు.. సైన్స్‌పార్కు ఏర్పాటు.. కళంకారి 'పేట'నేత చీరలకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు.. 380 పడకలతో నూతన ఆస్పత్రి నిర్మాణం.. ఇంటిగ్రేటెడ్ మార్కెట్.. ఏకో పార్కు.. మినీ ట్యాంకు బండ్.. గ్రామ గ్రామానికి రైతువేదికలు ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో జిల్లా ప్రగతి పరుగులు పెడుతోంది. 2019 ఫిబ్రవరి 17న నూతనంగా జిల్లాగా ఆవిర్భవించి నేటితో ఐదేళ్లు పూర్తి చేసుకొని ఆరో వసంతంలోకి అడుగిడుతుంది.



నారాయణపేట వ్యూ

ఆరో వసంతంలోకి జిల్లా

- విద్య, వైద్య రంగాల్లో ముందడుగు
- పేట – కొడంగల్ ప్రాజెక్టుకు అనుమతులు
- సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా అభివృద్ధిపై ఎన్నో ఆశలు

నారాయణపేట: జిల్లాను 11 మండలాలు, 252 రెవెన్యూ గ్రామాలు, మూడు మున్సిపాలిటీలు మక్తల్, నారాయణపేట, కోస్గి, 280 జీపీలతో ఏర్పాటు చేశారు. అనంతరం మరో రెండు మండలాలు నూతనంగా పెరగడంతో 13 మండలాలతో కొనసాగుతుంది. జిల్లా ఏర్పాటు కావడంతో కలెక్టర్, ఎస్పీలతో పాటు వివిధ జిల్లా ప్రభుత్వ శాఖలకు సంబంధించి అధికారులు ప్రజలకు అందుబాటులోకి రావడంతో సుపరిపాలన సులభమైంది.

అన్ని రంగాల్లో అభివృద్ధి

జిల్లా ఏర్పాటైన తర్వాత తొలి ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా రొనాల్డ్‌రోస్ బాధ్యతలు చేపట్టగా తొలి కలెక్టర్‌గా ఎస్.వెంకట్రావ్ బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ ఆఫీస్‌కు కార్యరూపం దాల్చడం, ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతిలో గ్రామాల్లో అభివృద్ధి బాట పట్టించారు. ఆయన బదిలీపై వెళ్లగా దాసరి హరిచందన రెండో కలెక్టర్‌గా రెండేళ్ల పాటు విధులు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో సైన్స్‌పార్కు, కళంకారీ నేత చీరలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఆమె బదిలీ అనంతరం ప్రస్తుత కలెక్టర్ కోయ శ్రీహర్ష విధుల్లో చేరారు. విద్య, వైద్య రంగాల్లో పరుగులు తీయిస్తున్నారు. ఇక పోలీసు శాఖ విషయానికి వస్తే మొదట ఇంచార్జీ ఎస్పీగా రెమారాజేశ్వరి, తొలి ఎస్పీగా డాక్టర్ చేతన విధులు చేపట్టారు. ఆమె బదిలీ అనంతరం ఎన్.వెంకటేశ్వర్లు ఎస్పీగా బాధ్యతలు చేపట్టి అసెంబ్లీ ఎన్నికల ముందు ట్రాన్స్‌ఫర్ చేయడంతో ప్రస్తుతం యోగేష్ గౌతమ్ విధులు నిర్వహిస్తున్నారు. లోకల్ బాడీ జిల్లా అడిషనల్ కలెక్టర్ గా కె.చంద్రారెడ్డి విధులు నిర్వహించి బదిలీపై వెళ్లగా ప్రస్తుతం మయాంక్ మిత్తల్ విధులు నిర్వహిస్తున్నారు.

విద్య, వైద్య రంగంలో ముందడుగు

జిల్లా ఏర్పాటు కావడంతో విద్య, వైద్య రంగంలో ముందడుగు వేస్తోంది. ఎస్ఎల్‌డీసీ కళాశాల అప్పటి మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి, అప్పటి పేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి చొరవతో ప్రభుత్వ పరం కావడంతో పాటు ధన్వడలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటైంది. ఈ ఏడాది నుంచి పాలిటెక్నిక్ అగ్రికల్చర్ కళాశాల ప్రారంభమైంది. మెడికల్ కళాశాల మంజూరు కావడంతో నారాయణపేట మండలంలోని అప్పక్‌పల్లి దగ్గర 380 బెడ్‌ల ఆస్పత్రిని నూతనంగా నిర్మిస్తున్నారు. 2024–25 విద్యసంవత్సరంలో మెడికల్ కళాశాల తరగతులు ప్రారంభించేందుకు సన్నాహాలు మొదలయ్యాయి.

పేట – కొడంగల్ లిఫ్టు ఇరిగేషన్‌కు అనుమతులు

కొడంగల్ నియోజకవర్గం నుంచి టీపీసీసీ అధ్యక్షుడైన రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేయంతోపాటు కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో అధికారంలోకి తీసుకొచ్చారు. అనంతరం ఆయనే సీఎం కావడంతో ఇక్కడి రైతుల పదేళ్ల ఆకాంక్షను నేరవేరుస్తూ పేట – కొడంగల్ లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ. 2,945 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఈ ప్రాంత రైతాంగమంతా హర్షం వ్యక్తం చేశారు. ఇక జిల్లా ఏర్పాటు కావడంతో తొలి జడ్పీ చైర్‌పర్సన్‌గా వనజ బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎన్నికైంది. కాగా మారిన రాజకీయ పరిణామాలతో ఆమె కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. మక్తల్ ఎమ్మెల్యేగా వాకిటి శ్రీహరి, నారాయణపేట ఎమ్మెల్యేగా పర్ణికా రెడ్డితో పాటు కొడంగల్‌కు రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

సీఎంపై ఆశలెన్నో..

సీఎం రేవంత్‌రెడ్డిపై సొంత జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వెనుకబడిన, వలసలకు పేరొందిన జిల్లాలో సాగునీటితో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలు నెలకొల్పాలని, కృష్ణ వికారాబాద్ రైల్వే లైను ఏర్పాటు చేయాలని, అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లా స్వరూపం

భూవిస్తీర్ణం: 2,33,689 హెక్టార్లు	
గ్రామ పంచాయతీలు: 280	
రెవెన్యూ గ్రామాలు 252	నియోజకవర్గాలు : మక్తల్, నారాయణ, కొడంగల్
సాగు విస్తీర్ణం: 1,67,911 హెక్టార్లు	సాగుచేస్తున్నది: 1,64,055 హెక్టార్లు
అటవీ ప్రాంతం : 4039 హెక్టర్లు	కుటుంబాలు: 1,10,877
జనాభా: 5,66,874	పురుషులు: 2,82,231
మహిళలు: 2,84,643	
ప్రాజెక్టులు: సంగంబండ, భూత్పూర్, కోయిల్‌సాగర్	
లిఫ్ట్ ఇరిగేషన్‌లు: తంగిడి, కుసుమూర్తి, పస్పుల	

కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయానికి శంకుస్థాపన

జిల్లా కలెక్టరేట్‌ను ఫిబ్రవరి 17, 2019న అప్పటి ఇంచార్జీ కలెక్టర్ రొనాల్డ్‌రోస్, ఎస్పీ కార్యాలయాన్ని ఇంచార్జీ ఎస్పీ రెమా రాజేశ్వరితోపాటు అప్పటి ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, నారాయణపేట, మక్తల్, కొడంగల్ అప్పటి ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, చిట్టెం రాంమోహన్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, అప్పటి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి అట్టహాసంగా ప్రారంభించారు. అనంతరం జిల్లా ఏర్పాటైన నాలుగేళ్ల తర్వాత కలెక్టరేట్, ఎస్పీ శాశ్వత భవన నిర్మాణాలకు గతేడాది జనవరి 24న అప్పటి మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, అప్పటి హోంశాఖ మంత్రి మహిమూద్ అలీ, అప్పటి వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపనలు చేసి పునాది వేశారు. జిల్లాలో 77 క్లస్టర్లలో రైతు వేదికల నిర్మాణాలు, 280 జీపీల్లో వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, హరిత హారంలో మొక్కలు నాటడం, జిల్లా కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఎక్లాస్‌పూర్ ఏకో పార్కు, కొండారెడ్డిపల్లి చెరువును మిని ట్యాంక్ బండ్‌గా మార్చడంతో పాటు పలు అభివృద్ధి పనుల్లో పరుగులు తీయించారు.



నారాయణపేట జిల్లా ఇన్‌చార్జ్‌గా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ రొనాల్డ్‌రోస్ (ఫైల్)

కాళేశ్వరంతో తెలంగాణ నవ్వులపాలు

- పాలమూరు ప్రాజెక్టు ద్వారా ప్రతి ఎకరాలకు సాగునీరు అందిస్తాం
- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



జడ్చర్లలో మాట్లాడుతున్న మల్లు భట్టి విక్రమార్క

జడ్చర్ల: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూణ్నాళ్లకే పగుళ్లు వచ్చిన ఘటనతో దేశంలో తెలంగాణ నవ్వుల పాలైందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచంద్‌రెడ్డి చేపట్టిన పాలమూరు న్యాయ యాత్ర ముగింపు సందర్భంగా శనివారం రాత్రి జడ్చర్లలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నీళ్లు విడుదల చేస్తే డ్యాం నిలబడదని, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టుల పరిస్థితి కూడా ఇంతే అని ఢిల్లీ నుంచి వచ్చిన డ్యాం సేఫ్టీ అధికారులు తేల్చిచెప్పారన్నారు. దీనిపై మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పాలమూరును సస్యశ్యామలం చేసేందుకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం జలయజ్ఞంతో చేపట్టిన ప్రాజెక్టులను పూర్తి చేయకపోగా పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టును రూ.వేల కోట్లతో మొదలుపెట్టి దశాబ్దం గడుస్తున్నా ఒక్క ఎకరాకు నీరివ్వలేదని విమర్శించారు. తాము ఈ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తామని చెప్పారు. ఇందిరమ్మ పంచిన భూములను ధరణి పేరుతో లాక్కున్నారని, వాటిని తిరిగి తీసుకుంటామని గతంలో తాము ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామన్నారు. ధరణిలో లోపాలను సరిచేసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. కేసీఆర్ లాగా మోసం చేసే ప్రసక్తే లేదన్నారు. అధికారంలోకి వచ్చిన రోజే రెండు గ్యారంటీలను అమలు చేశామని గుర్తు చేశారు. మరో రెండు గ్యారంటీలను అమలు చేసే తేదీలను రెండు మూడు రోజుల్లో ప్రకటిస్తామన్నారు. ఏడాది తర్వాత ప్రభుత్వ ఉద్యోగుల మొదటి వారంలోనే వేతనాలు ఇచ్చిన ఘనత తమది అన్నారు.

దేశాన్ని విచ్ఛిన్నం చేసే కుట్ర

దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు, దేశ సంపదను ఆదాని, అంబానీలకు దోచిపెట్టే కుట్రలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాల్పడుతోందని మల్లు భట్టివిక్రమార్క అన్నారు. దేశ సంపద ప్రజలకే చెందాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ న్యాయ యాత్ర చేస్తున్నారని చెప్పారు. దేశం విచ్ఛిన్నం కాకూడదని, దేశ సమైక్యతకు పాటుపడుతున్న కాంగ్రెస్‌ను వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఆదరించాలని ఆయన కోరారు. అలాగే రాష్ట్రంలో అంగన్‌వాడీలతో పాటు ఏఎన్ఎంలు, ఆశలు, మధ్యాహ్న భోజనం అందించే సిబ్బందికి ప్రతినెలా వేతనాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మహాలక్ష్మి లాంటి మహిళలకు ఎన్ని ఇబ్బందులు ఎదురైనా బిల్లులు ఇచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రారంభించిన మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందజేసేందుకు ఇందిరాక్రాంతి పథకాన్ని మొదలుపెడతామన్నారు. త్వరలోనే మహిళా పొదుపు సంఘాలతో భారీ ఎత్తున సమావేశం ఏర్పాటు చేసి తిరిగి మొదలుపెడతామన్నారు. ఇప్పటికే ఉచిత బస్సు, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న తమ ప్రభుత్వం తిరిగి ఇందిరమ్మ రాజ్యం తెచ్చేందుకు కృషిచేస్తున్నామన్నారు. దేశ సంపద, వనరులు కొంత మంది చేతుల్లోకి వెళ్తున్నాయని, వాటిని బలహీన వర్గాలకు అందించాలన్న సదుద్దేశంతో కులగణన జరగాలని భావించి జడ్చర్లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభలోనే ప్రకటించామని గుర్తుచేశారు. దేశంలో జరిగే కులగణనను తెలంగాణ నుంచే మొదలు పెడతామన్న రాహుల్‌గాంధీ హామీ ఆలోచన మేరకు అసెంబ్లీలో కులగణనపై ఏకగ్రీవ తీర్మానం చేశామని చెప్పారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచంద్‌రెడ్డి, నాయకులు ఒబేదుల్లా కొత్వాల్, రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అనుమతుల్లో జాగ్రత్తలు తప్పనిసరి

మద్దూరు: గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో మండలంలోని లింగల్‌చేడ్‌లోని పెద్ద వాగు నుంచి తరలిస్తున్న ఇసుక అనుమతుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఇసుక తరలింపులో అక్రమాలకు తావివ్వకూడదని కొత్తపల్లి తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు కలెక్టర్ కోయ శ్రీహర్ష అదేశించారు. శనివారం కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ మాయంక్ మిత్తల్‌తో కలిసి కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో అకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీసీ రోడ్ల కోసం ఇచ్చిన ఇసుక అనుమతులను పరిశీలించారు. అలాగే భూముల రిజిస్ట్రేషన్లు ఎన్ని వచ్చాయి ? వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలో పనిచేసే సిబ్బంది వివరాలతో పాటు ఏఏ విధులు నిర్వహిస్తున్నారని తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు.



కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయం రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

బాల్యవివాహాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం

నారాయణపేట: బాల్య వివాహాలు లేని సమాజాన్ని నిర్మించడంతోపాటు జిల్లాను మార్చాలని మహిళాభివృద్ధిశాఖ సంక్షేమశాఖ అధికారి వేణుగోపాల్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మహిళాభివృద్ధి శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిరోధక చట్టంపై జిల్లాకు చెందిన పూజారులు, ఖ్వాజీలు, పాస్టర్లకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టడంలో అందరూ సహకరించాలన్నారు. 18 ఏళ్లోపు అమ్మాయిలకు పెళ్లి చేయడం నేరమని, ఆ వయసులోపు అమ్మాయిలకు పెళ్లి చేయడానికి వారి తల్లిదండ్రులు ఎవరైనా వచ్చి ముహూర్తాలు పెట్టాలని వస్తే నిరాకరించాలన్నారు. ముస్లిం, క్రిస్టియన్ మతస్తుల్లోనూ బాల్య వివాహాలు జరగకుండా ఖ్వాజీలు, పాస్టర్లు చూడాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో మీరు చెప్పింది ప్రజలు వింటారన్నారు. విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలలో ప్రతి మత పెద్దలను సమన్వయం చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 18 ఏళ్లలోపు బాలికకు వివాహం జరిగి, ఆ బాలిక ఇష్టపూర్వకంగానే శారీరక సంబంధం కలిగి ఉంటే అది అత్యాచారమేనని, పోక్సో చట్ట ప్రకారం కేసు నమోదు అవుతుందన్నారు. తమ శాఖ ఆధ్వర్యంలో సర్వే చేసి జిల్లాలో 15వేల మంది 18 ఏళ్ల వయస్సు ఉన్న బాలికలను గుర్తించామని, గ్రామాలు, మండలాల్లో బాల్య వివాహ నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికను తయారు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ జ్యోతి, సఖి కేంద్ర సిబ్బంది, జిల్లాకు చెందిన పూజారులు , ఖ్వాజీలు, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధికారి వేణుగోపాల్

బీజేపీ ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యంగా పనిచేయాలి

నారాయణపేట/ నారాయణపేట రూరల్: ముచ్చటగా మూడోసారి కేంద్రంలో మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు రతంగపాండురెడ్డి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ నెల 20న కృష్ణలో కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప పూజలు చేసి యాత్రను ప్రారంభిస్తారని చెప్పారు.

కేంద్ర ప్రభుత్వంతోనే అభివృద్ధి

గ్రామాల్లో, పట్టణాల్లో అభివృద్ధి కేంద్ర ప్రభుత్వంతోనే జరుగుతుందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రఘువీర్ యాదవ్ అన్నారు. శనివారం పట్టణంలోని 12వ వార్డులో బీజేపీ గావ్ చలో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.

ఉద్యమాలతోనే జిల్లా సాధన

నారాయణపేట: జిల్లా అవిర్భవ సంబరాలను పలువురు ఉద్యమ నేతలు శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నేతలు మాట్లాడారు. రాష్ట్రంలో జిల్లాల విభజన సమయంలో నారాయణపేట రెవెన్యూ డివిజన్ ప్రాంతాన్ని వనపర్తి జిల్లాలోకి.. గద్వాల జిల్లాలోకి తీసుకెళ్తారని ప్రచారం జరిగిందన్నారు. నారాయణపేట జిల్లా చేయాలని జిల్లా అఖిల పక్షం ఆధ్వర్యంలో జిల్లా సాధన సమితి కన్వీనర్ వగ్గు మనోహర్‌గౌడ్ నేతృత్వంలో ఉద్యమాలు చేయడం జరిగిందన్నారు. 2019 ఫిబ్రవరి 17న అప్పటి ముఖ్య మంత్రికేసీఆర్ నారాయణపేట జిల్లాను ప్రకటించి ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను నేరవేర్చారన్నారు. ఉద్యమాలతోనే జిల్లా సాధ్యమైందన్నారు. వెనకబడిన ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసే బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందన్నారు. జిల్లా సాధనకు కృషి చేసిన మనోహర్‌గౌడ్ కృషి మరువలేనిదని స్మరించుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రతంగ్‌పాండురెడ్డి, చంద్రకాంత్, సత్యయాదవ్, రఘువీర్‌యాదవ్, సరాఫ్ నాగరాజు, తఖిచాంద్, నందునామాజీ, డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, వెంకట్రామరెడ్డి, కాశీనాథ్, వెంకోభ, వగ్గు కిరిటి గౌడ్ పాల్గొన్నారు.

మాయాజాలం..!

సీఎమ్మార్‌లో అంతులేని అక్రమాలు


- నిర్మాణంలోని మిల్లులకు ధాన్యం కేటాయింపులు
- విద్యుత్ సౌకర్యం, మర యంత్రాలు లేకపోయినా అప్పగింత
- గతంలో గద్వాలలో.. తాజాగా వనపర్తిలో వెలుగులోకి
- పెద్దమొత్తంలో చేతులు మారిన డబ్బులు
- ఇటీవల బదిలీ అయిన ఓ అధికారిదే 'కీ'రోల్?

■ పాన్‌గల్ మండలం మాందాపూర్ శివారులో ఓ ఇండస్ట్రీ ఉంది. 2023- 24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సీఎమ్మార్ కింద 2 లక్షల బస్తాల ధాన్యం కేటాయించారు. కేటాయింపులు చేసే నాటికి ఈ ఇండస్ట్రీలో కేవలం షెడ్లు మాత్రమే ఉన్నాయి. అప్పటికి ఈ మిల్లులో ఎలాంటి మిషనరీ లేదు. విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. ఇటీవలే మిల్లు నిర్మాణం పూర్తి కాగా యంత్రాలు బిగించారు.

■ నాటెల్లి- పామాపురం మధ్య ఉన్న ఓ రైస్ మిల్లు, కల్వరాల- వీపనగండ్ల మధ్య ఉన్న మరొకటి, పాన్‌గల్ మండలం గోప్లాపురం వద్ద ఉన్న మరో రైస్ మిల్లుకు సీఎమ్మార్ కింద లక్ష బస్తాల చొప్పున ధాన్యం కేటాయించారు. ఈ కేటాయింపులు జరిగే నాటికి ఈ మిల్లుల్లో కూడా ఎలాంటి మిషనరీ లేదు. విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి రాలేదు.

..కస్టం మిల్లింగ్ రైస్‌లో అక్రమాలకు అంతే లేకుండా పోయిందనడానికి ఇవి ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. విద్యుత్ కనెక్షన్ లేకుండా మిల్లులు పనిచేస్తాయా..? అసలు యంత్రాలు లేకుండా మర ఆడిస్తారా..? వనపర్తి జిల్లాలో అధికార యంత్రాంగానికి ఇవేమీ పట్టినట్లు లేవు. నిబంధనలకు విరుద్ధంగా షెడ్డు స్థాయి నిర్మాణంలో ఉన్న మిల్లులకు సీఎమ్మార్ ధాన్యం కేటాయింపులు చేశారు. అంతేకాదు.. అంతకు ముందు సీఎమ్మార్ రైస్ బకాయి ఉన్న మిల్లులకూ మళ్లీ కేటాయింపులు చేసినట్లు 'సాక్షి' పరిశీలనలో వెలుగుచూసింది. ఈ మేరకు పెద్దమొత్తంలో డబ్బులు చేతులు మారినట్లు తెలుస్తోంది.

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: విద్యుత్ కనెక్షన్ లేకుండానే మర ఆడించి సీఎమ్మార్ బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించినట్లు 2021లో వెలుగుచూసింది. గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం పుటాన్‌దొడ్డిలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ట్రేడర్స్, బీచుపల్లి వద్ద ఉన్న సాయిశ్రీ ట్రేడింగ్ కంపెనీ మిల్లులు, అయిజలోని అన్నపూర్ణ మిల్లు, గద్వాలలోని స్వాతి ట్రేడర్స్, శ్రీలక్ష్మీరంగ ట్రేడర్స్, శ్రీరాజరాజేశ్వరి రైస్‌మిల్లు, శివశక్తి అగ్రో రైస్ ఇండస్ట్రీస్, శ్రీసత్యదేవా ట్రేడర్స్‌కు పలు కారణాలతో విద్యుత్ సేవలు నిలిపివేశారు. 2020 నవంబర్ నుంచి 2021 ఏప్రిల్ వరకు ఆయా మిల్లులకు కరెంట్ సరఫరా చేయలేదు. కానీ, అదే సమయంలో పౌరసరఫరాల శాఖకు సీఎమ్మార్ బియ్యం అప్పగించినట్లు అధికారులు నివేదికలో పొందుపర్చగా.. గుట్టురట్టయింది. దీనిపై విచారణ సైతం కొనసాగింది. తాజాగా వనపర్తి జిల్లాలో నిర్మాణంలో ఉన్న మిల్లులకు విద్యుత్ కనెక్షన్ లేకుండానే, యంత్రాలు రాకుండానే సీఎమ్మార్ ధాన్యం కేటాయించడంపై ఆరోపణలు గుప్పుమంటున్నాయి. కేటాయింపుల తర్వాత ఆయా మిల్లుల్లో విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి రాగా.. ఇటీవలే మర యంత్రాలు బిగించారు. ఇందులో ఒకట్రెండు మిల్లులు సీఎమ్మార్ రైస్ అప్పగించినట్లు రికార్డులు స్పష్టం చేస్తుండగా.. పలు మిల్లుల యజమానులు టోకెన్ రాకపోవడంతో బియ్యం ఇంకా అప్పగించలేదని తెలుస్తోంది.



'పరమేశ్వరుడి' మాయ.. ఓ అధికారి కీ రోల్

విద్యుత్ సౌకర్యం, యంత్రాలు లేకుండానే సీఎమ్మార్ ధాన్యం కేటాయించడంతోపాటు గత సీఎమ్మార్ బకాయిలు పెట్టనప్పటికీ.. పలు మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేశారు. వనపర్తి జిల్లా రైస్ మిల్లుల సంఘంలో ఓ పదవిలో ఉన్న వ్యక్తికి చిన్నంబావి వద్ద ఉన్న మిల్లుకు లక్ష బస్తాల ధాన్యం కేటాయించారు. సదరు మిల్లు నిర్వాహకులు 2022-23 ఖరీఫ్, రబీకి సంబంధించి సీఎమ్మార్ బియ్యం బకాయిలు ఇంకా తీర్చలేదు. అయినప్పటికీ తిరిగి ధాన్యం కేటాయింపులు చేయడం అనుమానాలకు తావిస్తోంది. దేవుడి పేరు మీద ఉన్న మిల్లులకు సంబంధించిన ఓ యజమాని ఈ మేరకు చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. ఇందులో గతంలో వనపర్తి జిల్లాలో పనిచేసిన ఓ సివిల్ సప్లయ్ అధికారి కీలక పాత్ర పోషించి పెద్దఎత్తున కమీషన్లు దండుకున్నట్లు సమాచారం. సదరు అధికారిపై ఎప్పటి నుంచో తీవ్ర స్థాయిలో అవినీతి ఆరోపణలు వినిపిస్తుండగా.. ప్రభుత్వం మారిన క్రమంలో తనకున్న పలుకుబడితో సమీప జిల్లాకు బదిలీ చేయించుకున్నట్లు పౌరసరఫరాల శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. సీఎమ్మార్‌లో అక్రమాలపై లోతుగా విచారణ చేస్తే మరిన్ని నిజాలు వెలుగుచూసే అవకాశముంది.

విచారణ చేపడతాం..

మిషనరీ లేని మిల్లులకు సీఎమ్మార్ కేటాయింపులు చేయడం నిబంధనలకు విరుద్ధం. ఇలా చేసినట్లు మా దృష్టికి రాలేదు. దీనిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటాం. అవినీతి, అక్రమాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదు.

– శ్రీనాథ్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, వనపర్తి

క్లుప్తంగా

బాటనీ అధ్యాపకులపై విద్యార్థుల ఫిర్యాదు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ బాటనీ డిపార్టుమెంట్ అధ్యాపకులు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొంటూ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు శనివారం ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డికి ఫిర్యాదుచేశారు. మూడో సెమిస్టర్‌కు సంబంధించి ప్రాక్టికల్స్ నిర్వహిస్తే రాశామని, ఇప్పుడు సిలబస్ మారిందని.. మరోసారి పరీక్ష రాయాలని ఒత్తిడి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష రాసే క్రమంలో సిలబస్ మార్పులు ఉన్నాయని సూచిస్తే.. రాత్రికి రాత్రే రికార్డులు రాసి, ప్రాక్టికల్స్‌కు సిద్ధమైనట్లు తెలిపారు. ఒక అధ్యాకురాలు చెప్పినట్లు చేస్తే, మరో అధ్యాపకురాలు మార్కులు తగ్గిస్తానని హెచ్చరిస్తున్నట్లు ఆవేదన వ్యక్తంచేశారు. సమయపాలన లేకపోవడం, అధ్యాపకుల గొడవ, ఇంగ్లిష్‌లో బోధన సరిగ్గా లేకపోవడం వంటి వాటితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోయారు. సంబంధిత హెచ్‌ఓడీ, అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల ఫిర్యాదుపై పీయూ ఓఎస్డీ స్పందిస్తూ.. సంబంధిత డిపార్టుమెంట్ అధ్యాపకులను గతంలోనే హెచ్చరించామని.. అయినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. విద్యార్థులను ఇబ్బందులను గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమయం వచ్చినప్పుడు ప్రతి విద్యార్థి నుంచి ఫిర్యాదు తీసుకుంటామన్నారు. ప్రాక్టికల్స్ మార్కుల్లో అన్యాయం జరగకుండా చూస్తామన్నారు. అనంతరం సంబంధిత డిపార్టుమెంట్ అధ్యాపకులతో సమావేశం నిర్వహించినట్లు తెలిసింది.


కత్తులతో బెదిరించి డబ్బు వసూలు



రాత్రివేళ కాపలా కాస్తున్న కాలనీవాసులు

కొత్తకోట రూరల్: గుర్తుతెలియని దుండగులు ఓ కుటుంబాన్ని కత్తులతో బెదిరించి డబ్బు వసూలు చేసిన ఘటన కొత్తకోటలో కలకలం రేపింది. స్థానికుల వివరాల మేరకు.. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ ఎన్‌హెచ్–44కు అతి సమీపంలో ఉంటుంది. కాలనీలోని ఓ ఇంట్లోకి శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చొరబడి కత్తులతో బెదిరించి, పెద్ద మొత్తంలో డబ్బు డిమాండ్ చేశారు. అయితే తాము కూలీ పనులు చేసుకునే వాళ్లమని.. తమ వద్ద అంత డబ్బులేదని బాధిత కుటుంబ సభ్యులు వేడుకోవడంతో ఉన్నకాడికి తీసుకొని పరారైనట్లు కాలనీవాసులు తెలిపారు. కారులో నలుగురు వ్యక్తులతో పాటు ఒక మహిళ వచ్చినట్లు పేర్కొంటున్నారు. కాగా ఈ ఘటనతో కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. శనివారం రాత్రి కాలనీవాసులు కొందరు కాపలా కాశారు. రాత్రివేళ్ల పోలీసులు పెట్రోలింగ్ పెంచాలని కోరుతున్నారు. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డిని వివరణ కోరగా.. గుర్తుతెలియని దుండగులు కత్తులతో బెదిరించి, డబ్బు వసూలుచేసిన విషయం తమ దృష్టికి రాలేదని తెలిపారు. కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఇటుక దందా.. ఇష్టారాజ్యం



మహమ్మదాబాద్ సమీపంలో ఏర్పాటుచేసిన ఇటుక బట్టీ

- అనుమతులు లేకుండా మట్టి, కలప తరలింపు
- నిబంధనలకు విరుద్ధంగా బట్టీల నిర్వహణ
- పట్టించుకోని అధికారులు



ఇటుకల తయారీకి నిల్వ చేసిన మట్టి

మహమ్మదాబాద్: ఇటుక బట్టీల దందా ఇష్టానుసారంగా సాగుతోంది. బట్టీల ఏర్పాటుకు అవసరమైన మట్టి, కలపను అక్రమంగా తరలిస్తూ.. తమ వ్యాపారాన్ని మూడు ఇటుకలు, ఆరు బట్టీలు అన్న చందంగా సాగిస్తున్నారు. ఉమ్మడి గండేడ్ మండలంలోని మహమ్మదాబాద్, కంచన్‌పల్లి, కొంరెడ్డిపల్లి, నంచర్ల, గాధిర్యాల్ తదితర గ్రామాల్లో ఇటుక బట్టీల వ్యాపారం జోరుగా కొనసాగుతోంది. ఇటుకల తయారీకి అనుకూలమైన మట్టిని ప్రభుత్వ భూముల నుంచి యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీనిపై కొందరు ఇటుక బట్టీల వ్యాపారులను ప్రశ్నిస్తే.. తమ పొలాల నుంచి మట్టిని తీసుకొస్తున్నామని చెబుతున్నారు. అయితే ఇటుకల తయారీకి అవసరమైన మట్టిని రాత్రివేళ గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నట్లు తెలుస్తోంది. బట్టీల వద్ద మట్టి గుట్టలుగా ఉన్నా ఎవరికీ పట్టడం లేదు. అదేవిధంగా ఇటుకలను కాల్చేందుకు అవసరమైన కలపను సైతం అక్రమంగా తరలిస్తున్నారు. ఇటుకలు కాల్చే సమయంలో వచ్చే దట్టమైన పొగతో సమీపంలోని గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు.

అనుమతులు లేకుంటే చర్యలు..

ఇటుక బట్టీల ఏర్పాటుకు అవసరమైన మట్టి తరలింపునకు అనుమతులు తీసుకోకపోతే చర్యలు తీసుకుంటాం. బట్టీల నిర్వాహకుల వివరాలను సేకరించి, అనుమతులు తీసుకోని వారికి నోటీసులు జారీచేస్తాం. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌తో పూర్తి స్థాయిలో విచారణ నిర్వహిస్తాం.
– తిరుపతయ్య, తహసీల్దార్, మహమ్మదాబాద్

యథేచ్ఛగా విద్యుత్ చౌర్యం..

ఇటుకల తయారీకి నీటి అవసరం ఉండటంతో బట్టీల నిర్వాహకులు వ్యవసాయ బోరుబావులను లీజ్‌కు తీసుకున్నారు. ఈక్రమంలో ప్రభుత్వం రైతులకు ఉచితంగా అందించే విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తున్నారు. అంతేకాకుండా బట్టీల వద్ద విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. వ్యవసాయానికి అందించే విద్యుత్ చౌర్యానికి గురవుతున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. కాగా, ఇటుకల తయారీకి కావాల్సిన మట్టి, కలప తరలింపుతో పాటు విద్యుత్ చౌర్యం విషయం సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇటుక బట్టీల నిర్వహణపై దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోజంతా పర్యటనలు.. సమీక్షలు



మహిళా సంఘాల ప్రతినిధులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్

- పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ పర్యటన
- మున్సిపాలిటీలో చేపట్టే అభివృద్ధి పనులపై ఆరా

కోస్గి: మున్సిపాలిటీలో శనివారం రాష్ట్ర అధికారులు, జిల్లా అధికారులు పర్యటించారు. మొదటగా పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ మున్సిపల్ పరిధిలో గుర్తించిన ప్రభుత్వ భూములు, నూతనంగా చేపట్టే అభివృద్ధి పథకాలు, ఎంపిక చేసిన స్థలాలను కలెక్టర్, స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. పట్టణ రోడ్డు విస్తరణకు సంబంధించి కోర్టును ఆశ్రయించిన బాధితులతో చర్చించిన అంశాలు, మున్సిపల్ సమగ్ర అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారుల పర్యటన, సమీక్ష సమావేశాలకు పత్రిక విలేకర్లను సైతం అనుమతించకుండానే రాష్ట్ర, జిల్లా అధికారులు తమ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మహిళా సంఘాల ప్రతినిధులతో సమావేశమై స్వయం శక్తి సంఘాలుగా ఎదిగి ఆర్థికాభివృద్ధి సాధించాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ సూచించారు. మహిళా సంఘాల వివరాలు, సభ్యుల సంఖ్య, తీసుకున్న రుణాలు, బస్సుల్లో ఉచితంగా ప్రయాణించిన మహిళల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అభివృద్ధిని ప్రదర్శించారు. కాగా ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కావడంతో రాష్ట్ర, జిల్లా ఉన్నత అధికార యంత్రాంగం అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతోపాటు అన్ని శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నట్లు ఓ అధికారి తెలిపారు.

కలెక్టర్ సమీక్షలు..

ఉదయం నుంచి సాయంత్రం వరకు కలెక్టర్ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, కౌన్సిలర్లతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో ఉన్న డ్రెయినేజీ వ్యవస్థ, పట్టణంలోని కాలనీల్లో రోడ్ల వ్యవస్థ, ఇతర అంశాలను పరిశీలించి చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గురించి వివరించారు. వీరితోపాటు కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమీషనర్ శశిధర్, తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

కూతురిని హతమార్చిన తల్లికి రిమాండ్

లింగాల: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం కొత్తకుంటపల్లిలో కన్నకూతురిని హతమార్చిన తల్లిని శనివారం కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని చిన్నారి జాను (6)ను తల్లి మల్లేశ్వరి హతమార్చిన ఘటన మండలంలో సంచలనం రేపింది. కనికరం లేకుండా కన్నకూతురిని చంపడంపై గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వ్యక్తులకు జీవితఖైదు విధించినా తప్పేమి ఉండదని అంటున్నారు.

ఒకరిపై కేసు నమోదు

కొత్తకోట రూరల్: సీఎం రేవంత్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిలపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి వివరాల మేరకు.. పామాపురం గ్రామానికి చెందిన గులాబీ గోవింద్ సీఎం, ఎమ్మెల్యేలపై నిరాధారమైన పోస్టులు పెట్టడంతో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మేస్త్రీ శ్రీనివాసులు స్థానిక నాయకులతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. సోషల్ మీడియాలో నిరాధారమైన పోస్టులు పెడితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

విధులు లేవు.. వేతనాలు రావు



జడ్చర్ల పుర కార్యాలయంలో విధులు కోసం ఎదురుచూస్తున్న వీఆర్‌ఏలు

- ఇబ్బందుల్లో పదోన్నతి పొందిన వీఆర్‌ఏలు
- ఆర్థిక సమస్యలతో అవస్థలు

జడ్చర్ల: పదోన్నతి పొందిన వీఆర్‌ఏలలో కొందరికి పోస్టులు కేటాయించకపోవడంతో పాటు వేతనాలు సైతం చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెవెన్యూశాఖలో విధులు నిర్వర్తిస్తున్న వీఆర్‌ఏలను గతేడాది ఆగస్టులో అర్హతను బట్టి వివిధ కార్యాలయాల్లో జూనియర్ అసిస్టెంట్లుగా, అటెండర్లుగా నియమించాలని పేర్కొంటూ అప్పటి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కాని కొందరు వీఆర్‌ఏలకు నేటికీ పోస్టులు కేటాయించకపోవడంతో వారంతా ఓ వైపు విధులు లేక.. మరోవైపు వేతనాలు రాక సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న 24 మంది వీఆర్‌ఏలను స్థానిక పురపాలికలో సర్దుబాటు చేశారు. వీరి అర్హత ఆధారంగా 18 మంది జూనియర్ అసిస్టెంట్లుగా, ఆరుగురిని అటెండర్లుగా నియమించారు. అదేవిధంగా మహబూబ్‌నగర్‌లో సైతం 17 మంది వీఆర్‌ఏలు, 11 మంది అటెండర్లు ఉన్నారు. జడ్చర్ల మున్సిపాలిటీకి సంబంధించి అప్పటి కమిషనర్ మహ్మద్ షేక్ వీరిని తమ కార్యాలయంలో వార్డు అధికారులుగా సర్దుబాటు చేసుకుంటామని మొదట చెప్పారు. అనంతరం ఇక్కడి ఖాళీలన్నీ గ్రూప్–4 అభ్యర్థులకు సంబంధించి ఉన్నాయని.. వీఆర్‌ఏలకు సర్దుబాటు చేయడం కుదరదని స్పష్టం చేయడంతో వీఆర్‌ఏలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. తమకు ఐడీ నంబర్లు ఇచ్చి విధుల్లో చేర్చుకోవాలని కోరుతూ కలెక్టర్‌ను ఆశ్రయించారు. అయితే అప్పటికే వీఆర్‌ఏల సర్దుబాటు ప్రక్రియ ముగిసిందని.. మిగిలిన వారిని సర్దుబాటు చేయడం వీలు కాదని పేర్కొంటూ తదుపరి ఉత్తర్వుల కోసం కలెక్టర్ సీసీఎల్‌ఏకు నివేదించారు. సీసీఎల్‌ఏ నుంచి వచ్చే ఆదేశాల కోసం వీరంతా ఎదురు చూస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణమా?

అధికారుల నిర్లక్ష్యం కారణంగానే వీఆర్‌ఏలు నష్టపోయినట్లు తెలుస్తోంది. మొదటనే తమ కార్యాలయాల్లో సర్దుబాటు చేయడం కుదరదని స్పష్టంగా చెప్పి ఉంటే వీరికి వేరేచోట అవకాశం ఉండేది. అలా చేయకపోవడంతో ఖాళీగా ఉన్న పోస్టుల్లో నిజామాబాద్, యాదాద్రి జిల్లాల నుంచి వచ్చిన వీఆర్‌ఏలను సర్దుబాటు చేసి ప్రక్రియను పూర్తి చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో సతమతం..

గతేడాది ఆగస్టు నుంచి వేతనాలు లేక వీరంతా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ప్రతిరోజు మున్సిపల్ కార్యాలయానికి వచ్చి అధికారులు చెప్పిన పనులు చేసి వెళ్తున్నారే తప్పా నిర్దిష్ట విధులు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో మహబూబ్‌నగర్‌లో ఒకరు, జడ్చర్లలో ఒక అటెండర్ మృతిచెందారని తెలిపారు. ఇప్పటికైనా కలెక్టర్ తమ సమస్యలపై దృష్టి సారించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సర్దుబాటు చేసి న్యాయం చేయాలి..



జడ్చర్ల మున్సిపాలిటీలో వార్డు అధికారిగా నియమిస్తామని చెప్పిన అధికారులు తదుపరి ఆయా పోస్టులు గ్రూప్–4 అభ్యర్థులకు సంబంధించినవి చెప్పి నిలిపి వేశారు. అప్పటికే జిల్లావ్యాప్తంగా వీఆర్‌ఏల సర్దుబాటు ప్రక్రియ ముగిసింది. వేతనాలు కూడా ఇవ్వడం లేదు. తమకు న్యాయం చేసి ఆదుకోవాలి.
– రాముగౌడ్, పదోన్నతి పొందిన వీఆర్‌ఏ

దిక్కుతోచని స్థితిలో వీఆర్‌ఏలు..

గ్రూప్–4 అభ్యర్థులకు పేస్కేలు తక్కువగా ఉండడం.. పదోన్నతి పొందిన వీఆర్‌ఏల పేస్కేల్ ఎక్కువగా ఉండటంతో తేడాలొస్తున్నాయి. దీంతో ఆయా పోస్టుల్లో గ్రూప్–4 అభ్యర్థులనే నియమించాల్సి రావడంతో పదోన్నతి పొందిన వీఆర్‌ఏల భర్తీ ప్రక్రియ నిలిచిపోయింది. ఇతర శాఖల్లోనైనా సర్దుబాటు చేసేందుకు ఖాళీలు లేకపోవడంతో వీరంతా దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

మహమ్మదాబాద్: మండలంలోని నంచర్లకు చెందిన తల్లారి భీమయ్య భార్య కవిత (25) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. స్థానికుల వివరాల మేరకు.. అనారోగ్యం, కుటుంబ సమస్యలను తాళలేక రెండు నెలల కిందట కవిత ఒంటిపై డీజిల్ పోసుకుని నిప్పంటించుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు మంటలను ఆర్పివేసి, జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలికి కూతురు, కుమారుడు ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



శివకుమార్ (ఫైల్)



నేత్రదాన సర్టిఫికెట్ అందజేస్తున్న మధు

ఖిల్లాఘనపురం: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతిచెందిన ఘటన ఖిల్లాఘనపురం మండలం షాపూర్‌లో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. షాపూర్‌కు చెందిన తెలుగు తిరుపతయ్య, అంజమ్మల చిన్న కుమారుడు శివకుమార్ (18) కుంకుడు కాయల కోసం ఇంటి సమీపంలోని చెట్టు ఎక్కాడు. ఈక్రమంలో చెట్టుపై ఉన్న విద్యుత్ వైర్లను గమనించకుండా తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. చేతికొచ్చిన కుమారుడి మృతితో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు.

కుటుంబ సభ్యుల ఔదార్యం

పుట్టెడు దుఃఖంలోనూ శివకుమార్ కళ్లను దానంచేసి, కుటుంబ సభ్యులు ఔదార్యం చాటుకున్నారు. శివకుమార్ మృతదేహాన్ని మహబూబ్‌నగర్ ఆస్పత్రి మార్చురీకి తరలించగా.. ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి నేత్రదానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకొచ్చినట్లు యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాగితాల మధు తెలిపారు. శివకుమార్ కళ్లు మరో వ్యక్తికి చూపునిస్తాయని చెప్పారు. అనంతరం నేత్రదాన సర్టిఫికెట్‌ను కుటుంబ సభ్యులకు అందజేశారు.

పేలిన గ్యాస్ సిలిండర్.. గుడిసె దగ్ధం

కొత్తకోట రూరల్: గ్యాస్ సిలిండర్ పేలి గుడిసె దగ్ధమైన ఘటన కొత్తకోట పట్టణంలోని దేవి థియేటర్ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పట్టణానికి చెందిన శివస్వామి గట్టుయాదవ్ పూరి గుడిసెలో దేవుడి వద్ద దీపం వెలిగించి, బయటికి వెళ్లాడు. ఈక్రమంలో సిలిండర్ ఒక్కసారిగా పేలడంతో మంటలు చెలరేగాయి. గుడిసెలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. గుడిసెలో ఉన్న వంట సామగ్రి, నిత్యవసర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. పట్టణ నడిబొడ్డున సిలిండర్ పేలడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

ట్రాక్టర్ తగిలి బస్సు అద్దాలు ధ్వంసం



ఇరువర్గాలకు నచ్చచెబుతున్న ఎస్‌ఐ నరేందర్

ఆత్మకూర్: పట్టణంలోని గాం.దీచౌక్‌లో శనివారం చెరుకు ట్రాక్టర్ తగిలి ఆర్టీసీ బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి. గాంధీచౌక్‌లో షాద్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నిలపగా.. అటుగా వస్తున్న చెరుకు ట్రాక్టర్ తగలడంతో బస్సు అద్దాలు పగిలిపోయాయి. ఈవిషయంపై ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈక్రమంలో గంటపాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నరేందర్ ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను శాంతింపజేసి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

వేప యూరియాతో బహుళ ప్రయోజనాలు



పొలంలో యూరియా వేస్తున్న రైతు (ఫైల్)

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: పంటల సాగులో యూరియా వాడకం తప్పనిసరి. ప్రస్తుతం మార్కెట్‌లో రెండు రకాలుగా లభ్యమవుతుంది. ఒకటి సాధారణ, మరోకటి వేప పూత యూరియా. ఇప్పటి నుంచి వేప పూత యూరియానే ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం సూచనలు చేసింది. ఈ మేరకు వేప పూత యూరియాని వాడాలని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచిస్తున్నారు. వేప పూత యూరియా వలన కలిగే బహుళ ప్రయోజనాల గురించి రైతులకు సలహాలు, సూచనలు వివరించారు.

వేపతో ప్రయోజనం

తరతరాల నుంచి వేప లాభాలు పదిలం. వేప గింజలు, ఆకులు, నూనె, బెరడు వేర్లు అన్నీ రైతు నేస్తాలే. ఇలాంటి లక్షణాలతో వేప వృక్షం క్రిమి సంహారిణిగా మారింది. దీనికి తోడు వేప గింజల్లో నూనె శాతం అధికంగా ఉండటం వలన వేప విలువ మరింత పెరిగింది.

యూరియాతో..

పంటకు నత్రజని పోషకాన్ని 80 శాతం యూరియా రూపంలో అందిస్తారు. యూరియాలో నత్రజనితోపాటు 20 శాతం కర్బనం, 26 శాతం ఆక్సిజన్, 6 శాతం హైడ్రోజన్ మూలకాలు ఉన్నాయి. నత్రజని మూలకాన్ని పంటలు సద్వినియోగం చేసుకోకపోతే వృథాగా భూమిలోకి పోతుంది.

వేప పూత ఉపయోగం

వేప పూత యూరియాలో రెండు అంశాలు ఉన్నాయి. గాలి సహజ వాయువుల ద్వారా యూరియా తయారీ మొదటి అంశం. ఈ విధంగా తయారైన సన్న యూరియాపై వేప నూనె పూతలు పట్టించడం.

పని చేసే విధానం

సాధారణంగా యూరియా ఎరువులో నత్రజని అమ్మోనియం రూపంలో ఉంటుంది. యూరియా పొలాలకు వేసినప్పుడు భూమిలో ఉండే నైట్రిఫయింగ్ బ్యాక్టీరియా అమ్మోనియం రూపంలో ఉండే నత్రజనిని నైట్రేట్ రూపంలోకి మార్చి మొక్క వేరు వ్యవస్థకు అందకుండా భూమి పొరల్లోకి వెళ్తుంది. యూరియా వృథా అవుతుంది. అయితే వేప పూత యూరియా వల్ల ఈ బ్యాక్టీరియా చనిపోయి వృథాను అరికడుతుంది.

లాభాలు

సాధారణంగా సన్న యూరియా తేమను గ్రహించి బస్తాలలో కొంత మేర కరగడం, గడ్డలు కట్టడం జరుగుతుంది. వేప పూత యూరియాలో వేప నూనె యూరియా మీద పొరగా ఉండటంతో తేమను త్వరగా గ్రహించదు. సాధారణ యూరియా నీటిలో త్వరగా సులువుగా కరుగుతుంది. భూమిలో తేమ అధికంగా ఉన్నప్పుడు పంటకు అందించే అధిక భాగం మొక్కలకు అందకుండా భూమి లోపలి పొరల్లోకి చేరుతుంది. అయితే వేప పూత యూరియాతో ఈ సమస్యలుండవు. యూరియా ఎరువును సూర్యరశ్మి, గాలి తగిలితే ఎరువు ఆవిరి అవుతుంది. వేప పూత యూరియాలో ఈ సమస్య ఉండదు.

ఎలా వాడాలి

పంట అవసరాలకు అనుగుణంగా రెండు సార్లు వేప పూత యూరియా వేయాలి. భూమిలో సరైన తేమ ఉన్నప్పుడే వీటిని వేయాలి. వరి లాంటి పొలాల్లో నీటిని తీసి వేసి యూరియా వేయాలి. మరుసటి రోజు నీరు పెట్టాలి. తేలిక నేలల్లో తేలికపాటి తడి ఇచ్చి వేప పూత యూరియా వేయాలి. బరువు నేలల్లో తడి ఇచ్చే ముందు ఎరువు వేస్తే సరిపోతుంది.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అగ్నిప్రమాదం



132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లైటింగ్ ఎరస్టర్‌ను బిగిస్తున్న సిబ్బంది

అచ్చంపేట రూరల్: పట్టణంలోని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా లైటింగ్ ఎరస్టర్ ఫెయిల్ కావడంతో నిప్పురవ్వలు పడి మంటలు చెలరేగాయి. సబ్‌స్టేషన్‌లోని కొన్ని వస్తువులు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సాధారణంగా ముసురు వర్షంలో ఉరుములు, మెరుపుల కారణంగా లైటింగ్ ఎరస్టర్ ఫెయిల్ అవుతుందని.. ఒక్కసారిగా హైఓల్టేజీ రావడంతో ఫెలయ్యిందని ఏఈ ఆంజనేయులు తెలిపారు. కాగా, మధ్యాహ్నం 3 గంటలకు లైటింగ్ ఎరస్టర్ ఫెయిల్ కావడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. అచ్చంపేట, లింగాల, బల్మూర్, అమ్రాబాద్, పదర, ఉప్పునుంతల మండలాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లైటింగ్ ఎరస్టర్ విలువ సుమారు రూ.2 లక్షలకుపైగా ఉంటుందని.. కల్వకుర్తి నుంచి తీసుకొచ్చినట్లు ఏఈ తెలిపారు. కొత్త ఎరస్టర్ బిగించడానికి సుమారు 1గంట 15 నిమిషాల సమయం పట్టిందని, కల్వకుర్తి బ్రేక్ డౌన్ గ్యాంగ్ వచ్చి బిగించినట్లు చెప్పారు. బ్రేక్‌డౌన్ గ్యాంగ్‌లో 10 మంది సిబ్బంది ఉండగా.. అందులో ఐదుగురు మహిళా జేఎల్ఎంలు ఉన్నారు.

క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- ఎస్టీసీ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ రాధిక



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్టీసీ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ రాధిక పేర్కొన్నారు. ఆమె జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి వద్ద ఉన్న సైన్స్ మ్యూజియంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ ప్లాస్టిక్ నిషేధం అంశంపై ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి నాటికల ఏకపాత్రాభినయం పోటీలను ప్రారంభించారు. విద్యార్థి దశ నుంచే పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రదర్శనలో ప్రతిభను చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీయూ అధ్యాపకులు అర్జున్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, గాలెన్న, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

రామన్‌పాడులో నిలకడగా నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం నిలకడగా ఉంది. శనివారం 1,018 అడుగులకు నీటిమట్టం చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వలకు నీటి విడుదలను నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

రాష్ట్ర సాధనలో ఓబీసీల పాత్ర కీలకం



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): తెలంగాణ రాష్ట్ర సాధనలో ఓబీసీలు కీలకపాత్ర పోషించారని ఓబీసీ డెవలప్‌మెంట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కోట్ల కిషోర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం 70 శాతం బీసీలు ఉన్నప్పటికీ.. వారికి తగిన గుర్తింపు రావడం లేదన్నారు. 10 శాతం ఉన్న కొన్ని సామాజిక వర్గాలు మాత్రమే రాజ్యాధికారాన్ని అనుభవిస్తున్నాయని తెలిపారు. చట్టసభల్లో ఓబీసీలకు అవకాశం కల్పించాలని డిమాండ్‌చేశారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ టికెట్‌ను బీసీలకు కేటాయించాలని, లేనిపక్షంలో తగిన బుద్ధి చెబుతామన్నారు. సమావేశంలో యూత్ అధ్యక్షుడు శివప్రసాద్ యాదవ్, చంద్ర, శ్రీకాంత్, సాయికుమార్, విజయ్, సాయి, మల్లేష్, శివ ఉన్నారు.

గార్లబండతండాలో చిరుత సంచారం

ఖిల్లాఘనపురం: మండలంలోని గార్లబండతండా సమీపంలో శనివారం చిరుత తండావాసులకు కనిపించింది. ఉదయం 9:30 గంటలకు తండాకు చెందిన కెతావత్ మన్యనాయక్ ట్రాక్టర్‌పై తండా నుంచి ఖిల్లాఘనపురం వెళ్తుండగా తండాకు సమీపంలోఉన్న ప్రభుత్వ పాఠశాల సమీపంలో చిరుత మెల్లగా నడుచుకుంటు వెళ్లినట్లు తెలిపారు. కిందిబాగాన నీటి కుంట ఉందని అక్కడికి నీళ్ల తాగడానికి వెళ్లి ఉంటుందని అతను చెప్పాడు. పాఠశాలకు సమీపం నుంచి చిరుత వెళ్లినట్లు తెలియడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనకు గురయ్యారు. విషయాన్ని ఎంఈఓ ఉషారాణి, ఫారెస్ట్ అధికారులకు ఉపాధ్యాయులు చేరవేశారు. చిరుత రెండు నెలలుగా మండలంలోని గ్రామాలు, గుట్టల ప్రాంతాల్లో తిరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు.

కోనేరు సంస్థ సేవలు అభినందనీయం



అచ్చంపేట రూరల్: నల్లమల ప్రాంతంలోని చెంచులకు కోనేరు సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని సినీ నటుడు షఫి అన్నారు. శనివారం అచ్చంపేటలోని నేషనల్ బ్యాంకెట్ హాలులో నిర్వహించిన కోనేరు సంస్థ 25 వసంతాల వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. 25ఏళ్లపాటు మారుమూల ప్రాంతంలో చెంచు, గిరిజనుల అభివృద్ధికి కోనేరు సంస్థ సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. సంస్థ అడ్వయిజరీ కమిటీలో చేరి తనవంతు సాయం అందిస్తానని తెలిపారు. అనంతరం సంస్థ డైరెక్టర్ ఎంఏ సలీంను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ లక్ష్మణ్‌రావు, సాధన ఎన్జీఓ డైరెక్టర్ మురళి, ఐసీడీఎస్ సీడీపీఓ దమయంతి, సూపర్‌వైజర్లు, సంస్థ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు వరం హజ్‌యాత్ర

- ఈ ఏడాది ఉమ్మడి జిల్లా నుంచి 355 మంది పయనం
- గతేడాది కంటే ఈసారి ఎక్కువ మందికి అవకాశం
- మహబూబ్‌నగర్ నుంచి అధికంగా 272 మంది ఎంపిక
- వెయిటింగ్ లిస్టులో మరో 60 నుంచి 70 మందికి చోటు
- ఇప్పటికే ప్రారంభమైన హజ్‌యాత్రికుల తొలి శిక్షణ శిబిరం



హజ్ యాత్రికులకు అవగాహన కల్పిస్తున్న మతపెద్ద

జిల్లాల వారీగా హజ్ యాత్రికుల వివరాలు..

మహబూబ్‌నగర్	నారాయణపేట	నాగర్‌కర్నూల్	గద్వాల	వనపర్తి
272	26	25	21	11

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రస్తుతం హజ్‌యాత్ర ప్రాముఖ్యత పెరగడంతో ధనికుల నుంచి పేదవారు కూడా ఆసక్తి చూపుతున్నారు. ఆర్థిక వెసులుబాటు కలిగిన ప్రతి ముస్లిం జీవితంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలని పవిత్ర ఖురాన్‌లో పేర్కొనడంతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన ముస్లింలలో సైతం హజ్‌యాత్ర చేయాలనే కోరిక కలుగుతోంది. ఉమ్మడి జిల్లాలో గత కొన్నేళ్ల నుంచి హజ్‌యాత్ర చేసే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

ఉమ్మడి జిల్లా నుంచి..

ఈ ఏడాది ఉమ్మడి జిల్లా నుంచి 355 మంది రాష్ట్ర హజ్ కమిటీ నుంచి వెళ్తున్నారు. గతేడాది కంటే ఈసారి ఉమ్మడి జిల్లాలో ఎక్కువ మంది హజ్ యాత్ర చేయనున్నారు. మరో 60 నుంచి 70 మందికి వెయిటింగ్ లిస్టులో హజ్‌యాత్ర చేయడానికి అవకాశం లభించనుంది. మహబూబ్‌నగర్ జిల్లాలో ఈసారి అధికంగా 272 మంది హజ్‌యాత్రకు వెళ్తున్నారు. అదేవిధంగా ప్రైవేట్ ట్రావెల్స్ ద్వారా మరికొంతమంది హజ్‌కు వెళ్తున్నట్లు తెలిసింది.

యాత్రీకులకు శిక్షణ శిబిరాలు..

ఇస్లామిక్ సంవత్సరంలోని 'జిల్‌హజ్జా' మాసంలో మక్కా, మదీనా తదితర పుణ్యక్షేత్రాల్లో పాటించాల్సిన నియమాలు, నిబంధనలపై హజ్ యాత్రికులకు అవగాహన కల్పించడానికి జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాలను నిర్వహిస్తారు. మతపెద్దలను ఆహ్వానించి హజ్ యాత్రలో పాటించాల్సిన నియమ, నిబంధనలు, ప్రసిద్ధ స్థలాల ప్రాశస్త్యాలను వివరించి అవగాహన కల్పిస్తారు. ఇటీవలే హజ్‌యాత్రకు వెళ్లే వారికి జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రత్యేక మెడికల్ క్యాంప్ నిర్వహించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు అందించారు.

శనివారమే శిక్షణ..

జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం హజ్ యాత్రికుల మొదటి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. హైదరాబాద్‌కు చెందిన మతపెద్ద మౌలానా సాధిక్ మోహియోద్దీన్ యాత్రికులకు హజ్ యాత్రపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు, మతపెద్దలు పాల్గొన్నారు. అదేవిధంగా ఈ ఏడాది దాదాపు 6 నుంచి 7 వరకు శిక్షణ శిబిరాలు నిర్వహించి హజ్‌యాత్ర నిష్ణాతులైన మతపెద్దలచే అవగాహన కల్పించి చివరి శిబిరంలో టీకాల క్యాంపు ఏర్పాటు చేస్తారు. ప్రత్యేకంగా డిజిటల్ ద్వారా ప్రాక్టికల్‌గా హజ్‌యాత్రపై అవగాహన కల్పిస్తారు.



శిక్షణ శిబిరంలో పాల్గొన్న హజ్ యాత్రికులు

అవగాహన పెంచుకోవాలి..



ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్తున్న వారికి ప్రత్యేక శుభాకాంక్షలు. హజ్‌యాత్రలో ప్రజల క్షేమం, దేశం అభివృద్ధి కోసం దువా చేయాలి. హజ్ యాత్రికులకు నావంతు సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. శిక్షణ శిబిరాలను హజ్ యాత్రికులు సద్వినియోగం చేసుకొని యాత్రపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలి. హజ్‌యాత్రపై ఎలాంటి సందేహాలు ఉన్నా మతపెద్దలచే నివృత్తి చేసుకోవాలి.

– మహమూద్‌అలీ, జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు, మహబూబ్‌నగర్

కోలాహలంగా లక్ష్మీచెన్నకేశవుడి శకటోత్సవం



అలంకరణలో ఎద్దులబండి



శకటోత్సవానికి తరలివచ్చిన భక్తులు

జడ్చర్ల టౌన్: గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం శకటోత్సవం అత్యంత వైభవంగా సాగింది. రైతులు, భక్తులు తమ ఎద్దులబండ్లు, ట్రాక్టర్లను అందంగా అలంకరించి గ్రామ వీధుల్లో తిప్పారు. ఆలయ రాజగోపురం వద్ద ట్రాక్టర్లు, ఎద్దులబండ్లతో మెట్లను ఎక్కించే ప్రయత్నం చేశారు. ఎద్దుల బండ్లపై దేవుడి చిత్రపటాలతో కూడిన భారీ కటౌట్లను ఏర్పాటు చేశారు. శివసత్తుల నృత్యాలు, సంప్రదాయ మేళతాళాలతో శకటోత్సవం సాగింది. భక్తుల కేరింతలు, గోవింద నామస్మరణల నడుమ ఊరేగింపు ముగించారు. శకటోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా శుక్రవారం రాత్రి రథోత్సవానికి వచ్చిన భక్తులు శనివారం స్వామివారిని దర్శించుకొని స్వగ్రామాలకు బయలుదేరారు. శనివారం సైతం భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని దాసంగాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించగా.. మరికొందరు సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. ఆదివారం చక్రస్నానంతో ఉత్సవాలు ముగియనుండటం.. సెలవురోజు కావడంతో భక్తుల సంఖ్య మరింత పెరిగే ఆస్కారం ఉంది.

వైభవంగా పాలెం వెంకన్న రథోత్సవం



రథోత్సవానికి తరలివచ్చిన భక్తులు

బిజినేపల్లి: పాలెం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథసప్తమిని పురస్కరించుకొని శుక్రవారం అర్ధరాత్రి రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. రంగురంగుల పూలు, విద్యుద్దీపాలతో అందంగా అలంకరించిన రథంపై అలువేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తుల్ని ఉంచి ప్రత్యేక పూజల అనంతరం ముందుకు లాగారు. గ్రామానికి చెందిన భక్తులు హారతులతో రథానికి స్వాగతం పలికారు. స్వామివారి రథం లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. శనివారం నిత్యారాధన పూజలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు.

మన్యంకొండలో వైభవంగా తిరుచ్చి సేవ



తిరుచ్చి సేవ నిర్వహిస్తున్న పురోహితులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భగుడి నుంచి స్వామివారిని శోభాయమానంగా అలంకరించిన తిరుచ్చి వాహనంలో దేవస్థానం ఎదుట ఉన్న మండపం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. సన్నాయి వాయిద్యాలు, భక్తుల హరినామస్మరణ మధ్య ఊరేగింపు ముందుకు కదిలింది. తిరుచ్చి వాహనంలో ఊరేగుతూ స్వామివారు భక్తకోటికి దర్శనమిచ్చారు. మండపం వద్ద ప్రత్యేక పూజల అనంతరం స్వామివారిని మళ్లీ గర్భగుడి వద్దకు తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూద్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి తదితరులు పాల్గొన్నారు.

'నిలువురాళ్ల'లో స్ఫూర్తిదాయక కథనాలు



డీఈఓకు నగదు అందిస్తున్న సైన్స్ ఫోరం సభ్యులు

నారాయణపేట రూరల్: జిల్లా విద్యాశాఖ ప్రారంభించిన నిలువురాళ్ల మాస సంచికలో స్ఫూర్తిదాయక కథనాలు ఎన్నో ఉన్నాయని సైన్స్‌ఫోరం జిల్లా కన్వీనర్ బీజీ కనకప్ప అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫిబ్రవరి మాస సంచికను సీవీ రామన్ వారి సౌజన్యంతో ముద్రిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అమలుచేస్తున్న అనేక కార్యక్రమాలకు మార్గదర్శకులుగా నిలుస్తున్న టీచర్లు, విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీస్తున్న వారి పరిచయంతో పాటు విజ్ఞాన అంశాలను జోడించి విడుదల చేస్తున్నట్లు వివరించారు. అనంతరం ఈనెల సంచిక ప్రచురణకు అవసరమైన రూ.25 వేలను డీఈఓ ఎండీ అబ్దుల్ ఘనికి అందించారు. కార్యక్రమంలో ఏఎంఓ విద్యాసాగర్, సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, ఫోరం సభ్యులు భానుప్రకాష్, మహేష్ సాగర్, వసంత్, లాజర్, శ్రీనివాసులు, రాములు, జయంత్, సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంజినీరింగ్, లా కళాశాల ఏర్పాటుకోసం నిరసన



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ప్రభుత్వం వెంటనే ఇంజినీరింగ్, లా కళాశాలలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈనెల 24వ తేదీ వరకు పలు రకాలుగా నిరసనలు చేపట్టనున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఎస్ఎస్‌యూ, పీయూజేఏసీ ఇతర విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ట్రాక్టర్ రివర్స్‌గేర్ పోటీలు



పోటీలను తిలకిస్తున్న జనం

అడ్డాకుల: మండలంలోని రాచాల లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం ఆలయం ఎదుట ట్రాక్టర్ డ్రైవర్లకు నిర్వహించిన రివర్స్‌గేర్ పోటీలు ఆకట్టుకున్నాయి. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 42 మంది డ్రైవర్లు పోటీల్లో పాల్గొన్నారు. నారాయణపేట జిల్లా నర్వ మండలం లంకాలకు చెందిన ముగ్గురు డ్రైవర్లు విజేతలుగా నిలిచారు. లంకాలకు చెందిన ఎల్లప్పకు మొదటి బహుమతి కింద 8 తులాల వెండి, రవికి రెండో బహుమతి కింద 5 తులాల వెండి, లడ్డూకు మూడో బహుమతి కింద 3 తులాల వెండిని నిర్వాహకులు అందజేశారు. లంకాలలో ఏటా ట్రాక్టర్ రివర్స్‌గేర్ పోటీలు నిర్వహిస్తుండటంతో ఒకే గ్రామానికి చెందిన డ్రైవర్లు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిరుపతయ్య, చక్రధర్‌రెడ్డి, రామకృష్ణ, బుచ్చన్న, రాము, రంజిత్‌కుమార్, రాఘవరెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దేశానికి వెన్నెముక ఇంజినీర్లు



అవగాహన కల్పిస్తున్న రామేశ్వర్‌రావు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంజినీర్లు దేశానికి వెన్నెముక లాంటి వారని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ రామేశ్వర్‌రావు అన్నారు. స్థానిక జయప్రకాశ్ నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 'ఇంజినీరింగ్ విద్య ఆవశ్యకత'పై ఇంటర్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో మౌలిక వసతుల కల్పన, సమస్యల పరిష్కారానికి ఇంజినీర్లు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్ వంటి కోర్సులతో ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజింగ్ డైరెక్టర్ మదన్మోహన్, ఎంఎస్ఎన్ కంపెనీ ల్యాబ్ మేనేజర్ చెలిమెల శ్రీకాంత్, కళాశాల చైర్మన్ కేఎస్ రవికుమార్, కార్యదర్శి వెంకటరామారావు, ప్రిన్సిపాల్ సుజీవన్, చంద్రశేఖర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

జడ్చర్లలో ట్రాఫిక్ కష్టాలు



సిగ్నల్‌గడ్డపై నిలిచిపోయిన వాహనాలు

- రోడ్డు పనులు కొనసాగుతుండటంతో సిగ్నల్‌గడ్డపై నిలిచిన వాహనాలు
- గంగాపురం బ్రహ్మోత్సవాలతో పెరిగిన రద్దీ



ఎల్‌బీసీ మార్గంలో నిలిచిపోయిన వాహనాలు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలో ట్రాఫిక్ కష్టాలు వెంటాడుతున్నాయి. శనివారం మధ్యాహ్నం 3:30 గంటల నుంచి రాత్రి వరకు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్ పెరిగింది. ఇదే సమయంలో సిగ్నల్‌గడ్డ వద్ద రోడ్డు పనులు చేస్తున్న క్రమంలో ఆర్‌యూబీ నిర్మాణం కోసం కాంక్రీట్ టిప్పర్ తీసుకువచ్చి రోడ్డుపై ఉంచటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇదే సమయంలో పాఠశాలలు వదలటంతో స్కూల్‌బస్సులు, కంపెనీల బస్సులు రావటంతో ట్రాఫిక్ జాం ఏర్పడింది. వీటితోపాటు కాంగ్రెస్ పార్టీ కార్నర్ మీటింగ్‌కు వచ్చే వాహనాలు ప్రారంభం కావటం ట్రాఫిక్ మరింతగా పెరిగింది. సిగ్నల్‌గడ్డకు మూడువైపులా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ఎల్‌బీసీ కార్యాలయం, అటు డిగ్రీ కళాశాల పట్టణంలోకి వెళ్లే మార్గంలో పెట్రోల్ బంక్ వరకు వాహనాలు నిలిచిపోయాయి. గంటల తరబడి ట్రాఫిక్‌లో వాహనదారులు కష్టాలు ఎదుర్కొన్నారు. పోలీసులు రంగప్రవేశం చేసి రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు నానా పాట్లు పడ్డారు. రోడ్డు పనులను ఉదయం చేయకుండా రాత్రిళ్లు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు. ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు సూచించాలని వాహనదారులు కోరుతున్నారు.

సమన్వయలోపం

పట్టణంలో ట్రాఫిక్ సమస్య పెరిగేందుకు అధికారుల మధ్య సమన్వయలోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. పోలీసులు, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు సమీక్ష నిర్వహించకుండా ఉన్నారు. మూడుశాఖలు సమీక్ష జరిపి ప్రత్యామ్నాయ మార్గాలను కల్పించాల్సిన అవసరం ఉంది. దీనికి తోడు జాతీయరహదారి విస్తరణ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా చేస్తుండటంతో సమస్య ముదిరిపోతుంది. ఒక వైపు పని పూర్తిచేసి మరోవైపు మొదలుపెడితే సమస్య కొంత తగ్గుతుంది. అలా కాకుండా రోడ్డు కిరువైపులా పనులు చేస్తుండటం, ట్రాఫిక్ ఉన్నప్పుడే పనులు చేస్తుండటంతో సమస్య జఠిలంగా మారుతుంది.

అన్ని వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- సీడబ్ల్యూసీ ప్రత్యే ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి



మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి తదితరులు

రాజాపూర్: నాడు ఇందిరమ్మ పాలన నుంచి నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో అన్ని వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ పాలనతోనే సాధ్యమవుతుందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి అన్నారు. పాలమూరు న్యాయయాత్రలో భాగంగా శనివారం మండలంలోని కల్లేపల్లి, ఈద్గాన్‌పల్లి, మల్లేపల్లిలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని ప్రాజెక్టుల పేరుతో అప్పుల కుప్పగా మార్చారన్నారు. రాష్ట్రంలో ఒక్క ఎకరాకు నీళ్ల ఇవ్వలేదన్నారు. కల్వకుర్తి, నెట్టంపాడు, భీమా, సరళాసాగర్ వంటి ప్రాజెక్టులు పూర్తి చేసుకున్నది కాంగ్రెస్ పాలనలోనే అని తెలిపారు. ఇందిరమ్మ పాలనలో పేదలకు భూములు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మించుకున్నామని, మొన్నటి వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు పేదోడికి ఒక్క ఇల్లు కూడా నిర్మించి ఇచ్చిన పాపాన పోలేదన్నారు. మన ప్రాంతానికి న్యాయం చేయాలనే ఈ న్యాయయాత్ర చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దుష్యంత్‌రెడ్డి, నరహరి, జహీర్‌అక్తర్, గోవర్ధన్‌రెడ్డి, రమణ, రమేష్, యాదయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కల కాల్చివేతపై విచారణ

- పొన్నకల్‌లో పోలీసుల పహారా

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్‌లో సంచలనం రేపిన వీధికుక్కల కాల్చివేత ఘటనలో పోలీసులు విచారణ వేగవంతం చేశారు. గురువారం అర్ధరాత్రి కారులో వచ్చిన దుండగులు తుపాకీతో 21 కుక్కలను కాల్చివేసిన నేపథ్యంలో శుక్రవారం రాత్రి అడ్డాకుల పోలీసులు గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహించారు. కుక్కలను తుపాకితో కాల్చిన క్రమంలో తుపాకులు కలిగిన వారిపై ఆరా తీస్తున్నారు. గ్రామంలోకి వచ్చి వెళ్లిన కారు ఎక్కడి నుంచి వచ్చింది.. అందులో ఎవరొచ్చారన్నది ఇంకా తేలకపోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుపాకులతో వచ్చిన వారు చోరీకి వచ్చారా.. మరేదైనా కారణంతో వచ్చి కుక్కలను కాల్చి వెళ్లారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా గ్రామంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు లేకపోవడంతో గ్రామంలోకి వచ్చి వెళ్లే వారి వివరాలు తెలియడం లేదు. గుర్తుతెలియని దుండగులు గ్రామంలోకి వచ్చి కుక్కలను కాల్చిన తర్వాత సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించాలని శనివారం గ్రామపెద్దలు ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. పొన్నకల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే రాచాల, నందిపేట, జీన్గరాల, జోకూర్, కొకుంట్ల గ్రామాలకు వచ్చి వెళ్లే వాహనాలను గుర్తించే అవకాశం ఉంది. అయితే జాతీయ రహదారిపై ప్రధాన కూడళ్లు, స్టేజీల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు చాలాచోట్ల పనిచేయడం లేదని తెలిసింది. సీసీ కెమెరాల నిర్వహణపై పోలీసులు దృష్టిసారిస్తే నేరాలు జరిగినప్పుడు నిందితులను త్వరగా గుర్తించి కేసులను ఛేదించవచ్చు.

చిన్నారి అదృశ్యంపై న్యాయమూర్తి ఆగ్రహం

- జనరల్ ఆస్పత్రి తనిఖీ చేసిన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి

పాలమూరు: మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో ఈనెల 7న నాలుగు నెలల చిన్నారి అదృశ్య ఘటనపై జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి సీరియస్ అయ్యారు. జనరల్ ఆస్పత్రిని శనివారం న్యాయమూర్తి ఆకస్మికంగా తనిఖీ చేసి చిన్నారి అదృశ్యం ఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జీవన్‌తో మాట్లాడారు. అడ్డాకుల మండలం కందూరు గ్రామానికి చెందిన బోయ అంజమ్మ కూతురు నాలుగు నెలల చిన్నారి తల్లి దగ్గరి నుంచి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించడంతో ఆస్పత్రి వర్గాల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. వెంటనే సీసీటీవీ పుటేజీలను పరిశీలించి నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రిలో విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు, సిబ్బందిపై చర్యలకు ఆదేశించారు. ఆస్పత్రి వర్గాలు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఆయన వెంట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సంధ్యారాణి, ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి హరికుమార్ తదితరులున్నారు.



వివరాలు తెలుసుకుంటున్న న్యాయమూర్తి